
ప్రాణాలకు ఖరీదు

- నేరాలు చేసినా తప్పించుకు తిరుగుతున్న బడాబాబులు
- చాలా ఘటనల్లో పోలీసుల వైఖరి వివాదాస్పదం

న్యూస్‌టుడే, గద్వాల, మహబూబ్‌నగర్‌ నేర విభాగం

ఏదో ఒక పనిచేసుకుని జీవనం సాగించే బీదాబిక్కీ ప్రజలు అన్యాయానికి, అఘాయిత్యానికి గురైతే అండగా నిలవాల్సిన వ్యవస్థలు సరిగా స్పందించడం లేదు. నిందితులు రాజకీయ పలుకుబడితో పోలీసులను ఉపయోగించి, తప్పుడు కేసులు పెట్టి, భయపెట్టి నోరెత్తకుండా చేస్తున్నారు. బాధితులకు ఎంతో కొంత ముట్టజెప్పి వారి ప్రాణాలకు కూడా ఖరీదు కడుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో అత్యాచార ఘటనలు, బాలికల ఆత్మహత్యలు, ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం వికటించి చనిపోవటం, రోడ్డు ప్రమాద మరణాలు నిత్యకృత్యమవుతున్నాయి. బాధితుల్లో ఎక్కువ మంది నిరుపేదలే. ఘటనలపై ఎంత మంది గొంతెత్తినా, పత్రికలు, ప్రసార మాధ్యమాల్లో కథనాలు వచ్చినా చివరికి డబ్బు, రాజకీయ పలుకుబడితే పైచేయి అవుతోంది. కసులు నీరు గారుస్తుండటం పరిపాటిగా మారింది. తాజాగా గద్వాల జిల్లాలో జరిగిన ఘటన చర్చనీయాంశమవుతోంది.



మచ్చుకు కొన్ని ఘటనలు..

- గద్వాల మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక చేయని నేరం మోపారని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎన్ని విమర్శలు వచ్చినా పోలీసులు అడుగు ముందుకు వేయలేదు. కీలక ప్రజాప్రతినిధి జోక్యంతోనే ఇలా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బాధితురాలి కుటుంబానికి పెద్దఎత్తున డబ్బు ఆశ జూపినట్లు ఆరోపణలు వచ్చాయి.
- ధరూరు మండలంలో కొద్ది రోజుల క్రితం ఓ వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై ఎన్నో అనుమానాలు ఉన్నా కుటుంబ సభ్యులను ఒప్పించి చేసి ప్రమాదవశాత్తు చెరువులో మునిగినట్లుగా లెక్కలు గట్టి కేసును నీరుగార్చే ప్రయత్నంలో పెద్ద మనుషులు సఫలయ్యారు.
- గద్వాల మండలంలో ఓ యువకుడు పోలీసులకు ఫిర్యాదు ఇప్పించారు.
- కేటీదొడ్డి మండలం ఉమిత్యాలలో యువకుల వేధింపుల కారణంగా ఓ బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. సామాజిక మాధ్యమాలు, ప్రతికలు, ప్రసార మాధ్యమాల్లో కథనాలు వచ్చాక గానీ పోలీసులు స్పందించలేదు. చివరికి ముగ్గురిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఈ కేసులో కూడా బాలిక ప్రాణానికి వేధించటంతో అవమాన భారంతో బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. పరువుపోతుందని కుటుంబ సభ్యులు ఇతర కారణాలు చెప్పి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ యువకుడు మాత్రం దర్జాగా తిరుగుతున్నాడు.
- గట్టు మండలంలో పేలుళ్లతో ఇతర రాష్ట్రానికి చెందిన కార్మికుడు మృతిచెందితే కంపెనీ ప్రతినిధులపై నామమాత్రంగా కేసులు నమోదు చేశారు.
- నాగర్‌కర్నూల్‌లో ఇసుక ట్రాక్టర్‌ ఢీకొని ఇద్దరు యువకులు మృతిచెందగా ఇసుక మాఫియా మొత్తం రంగంలోకి దిగి వ్యవహారాన్ని చక్కబెట్టారు.
- దేవరకద్ర మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై ఇద్దరు యువకులు అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలే స్వయంగా ఈ విషయాన్ని చెప్పింది. అయినా ఒక్కరిపైనే కేసు నమోదైంది.
- కొల్లాపూర్‌ మండలంలోని ఓ తండాలో చెంచు మహిళను తీవ్రంగా కొట్టిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. చాలామందిపై ఆరోపణలు ఉన్నా, దాడి వీడియోలు బయటకు వచ్చినా కేసు మాత్రం నలుగురిపైనే నమోదు చేశారు.

ఆసుపత్రి మరణాలపై కేసులేవీ..

- గద్వాలలోని పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో పది నెలల వ్యవధిలో వైద్యం వికటించి ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. వైద్యులు బాధిత కుటుంబాలకు ఎంతో కొంత సొమ్ము ముట్టజెప్పి ఆస్పత్రులపై కేసులు కాకుండా చూసుకున్నారు.
- ఈ ఏడాది జులైలో ఓ మహిళ కడుపు నొప్పితో నాగర్‌కర్నూలులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి రాగా వైద్యం వికటించి మృతి చెందింది. బంధువులు ఆందోళనకు దిగటంతో కొంత డబ్బు ముట్టచెప్పి వైద్యులు తమపై కేసు కాకుండా చేసుకున్నారు.
- నాగర్‌కర్నూల్‌లోని మరో ఆస్పత్రికి వచ్చిన మహిళకు రక్తం తక్కువగా ఉన్నా ఆపరేషన్‌ చేయటంతో మృతిచెందింది. కుటుంబ సభ్యులు ఆస్పత్రి ముందు ధర్నాకు దిగటంతో కొంత డబ్బిచ్చి నోరు నొక్కేశారు.

కల్తీ కల్లు మరణాలు ఎన్నో.. : మహబూబ్‌నగర్‌లో కల్తీ కల్లు తాగి చాలా మంది ఆసుపత్రి పాలయ్యారు. ముగ్గురు మృతిచెందినా అనారోగ్యమే కారణమని కొట్టిపారేస్తూ కల్లు డిపోల నిర్వాహకులపై కేసు నమోదు కాలేదు. మానవపాడు మండలంలోని ఓ గ్రామంలో కల్తీ కల్లు తాగి ముగ్గురు మృతిచెందినా ఇలాగే చేశారు. బల్మూరు మండలం, జడర్ల పరిసరాల్లో కల్తీ కల్లు తాగి కొందరు మృతిచెందినా కేసులు నమోదు కాలేదు.

27న అండర్‌-14 ఖోఖో జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్‌ క్రీడలు, న్యూస్‌టుడే: పాఠశాల క్రీడ సమాఖ్య (ఎస్‌జీఎఫ్‌) అండర్‌-14 ఉమ్మడి జిల్లా ఖోఖో టోర్నీలో పాల్గొనే మహబూబ్‌నగర్‌ జిల్లా బాల, బాలికల జట్లను ఈ నెల 27న జిల్లా కేంద్రంలోని డీఎస్‌ఏ మైదానంలో ఉదయం 8 గంటలకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్‌ కార్యదర్శి శారదాబాయి శుక్రవారం తెలిపారు. బోనఫైడ్‌, ఆధార్‌తో ఎంపికలకు హాజరుకావాలని సూచించారు.

సమగ్ర సర్వే సాధ్యమేనా!



పాన్‌గల్‌లో డిజిటల్‌ సర్వే (పాతచిత్రం)

కొత్తకోట, న్యూస్‌టుడే: భూ వివాదాల పరిష్కారం లక్ష్యంగా ప్రతి వ్యవసాయ క్షేత్రానికి తప్పని సరిగా నక్షా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. ధరణిలో అనేక అవకతవకలు జరిగాయని ఆర్వోఆర్‌-2024ను అమలులోకి తేవాలని యోచిస్తోంది. తాజాగా క్రయ విక్రయాలు జరిగే సమయంలో భూ నక్షా చిత్రం తప్పని సరి చేయాలని చూస్తోంది. ఈ క్రమంలో సర్వేయర్ల ఆవశ్యత పెరిగింది. ఇప్పటి వరకు వీరు పూర్తిస్థాయిలో లేక పోవడంతో గ్రామాల్లో భూ వివాదాలు జరుగుతున్నాయి. వాటికి పరిష్కారం దక్కక ధరణిలో చోటు లేకుండా వివాదాస్పదమవుతోంది. ఇలాంటి పరిస్థితులకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం సర్వే భూదస్త్రాల విభాగాల పటిష్ఠతపై కసరత్తు ప్రారంభించింది.

వివాదాల పరిష్కారానికి..

జిల్లాలో నిజాం పాలనలో సెత్వార్‌ పేరిట 1938-45 మధ్య కాలంలో సర్వే నిర్వహించినట్లు తెలుస్తోంది. రెవెన్యూ గ్రామాల్లో పట్టాదారుల సమాచారంతో కాస్రా పహాణి తయారు చేసి అందుబాటులో ఉంచింది. ప్రభుత్వం ఏర్పడ్డ వాటికే కొలమానంగా రెవెన్యూ శాఖ పరిగణించింది. సమస్య ఏర్పడినప్పుడు విక్రయాలు జరిగి వివాదాలు తలెత్తిన సమయంలో భూ కొలతల శాఖ వద్ద ఉన్న 'టిపన్‌' (కొలతల పుస్తకం) రూపంలో కొనుగోలుదారుకు భూమిని అప్పజెబుతూ వస్తున్నారు. రెవెన్యూ శాఖ వద్ద ఉన్న కాస్రా పహాణీ ఆధారంగానే భూ దస్త్రాల ప్రక్షాళన కొనసాగించారు. తరచూ భూముల వివాదాలు అపరిష్కృతంగా కొనసాగుతున్నాయి. అలాంటి వివాదాలకు శాశ్వత పరిష్కారం దిశగా భూసర్వే అంశం, నక్షా ఆధారంగానే రిజిస్ట్రేషన్లు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తుండటంతో సర్వేయర్ల ప్రాధాన్యత పెరిగింది.

జిల్లా	సాగు భూములు	గ్రామాలు	సర్వేయర్లు
మహబూబ్‌నగర్‌	4,44,853	441	13
నాగర్‌కర్నూల్‌	7,30,311	461	14
వనపర్తి	3,58,848	255	13
జోగులాంబ గద్వాల	4,47,427	255	7
నారాయణపేట	4,47,252	280	10

పూర్తిస్థాయిలో లేకనే..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సర్వేయర్ల కొరత కారణంగా భూముల ప్రక్షాళన రైతుల్ని వేధిస్తున్నాయి. ఆ శాఖలో కంప్యూటర్‌ డ్రాఫ్ట్‌మెన్‌, జూనియర్‌ అసిస్టెంట్‌ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జోగులాంబ గద్వాల జిల్లా ఏర్పడినప్పటి నుంచి కంప్యూటర్‌ విభాగంలో సిబ్బంది లేరు. గతంలో సర్వేయర్లు గొలుసుతో భూములు కొలిచే వారు. సాంకేతికత పెరిగిన క్రమంలో డిజిటల్‌ యంత్రాలు ఉపయోగిస్తున్నారు. ఎత్తైన, లోతైన ప్రదేశాల కొలతకు డీజీపీఎస్‌ (డిఫ్రెన్షియల్‌ గ్లోబల్‌ పొజిషనింగ్‌ సిస్టం) యంత్రం సాయంతో కొలతలు వేస్తున్నారు.

వేర్వేరుగా సన్న, దొడ్డురకం ధాన్యం కొనుగోలు కేంద్రాలు



పశుగణన సర్వే గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్‌ ఆదర్శ్‌ సురభి, అధికారులు

వనపర్తి న్యూటౌన్‌, న్యూస్‌టుడే : సన్న, దొడ్డు రకం ధాన్యం కొనుగోలు కేంద్రాలను వేర్వేరుగా ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ ఆదర్శ్‌ సురభి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం వరి ధాన్యం కొనుగోలుపై సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో వ్యవసాయ, పౌరసరఫరాల శాఖల అధికారులు ప్రణాళికబద్ధంగా, రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రాల్లో సంచులు, టార్పాలిన్ల కొరత లేకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్‌ నగేశ్‌, జిల్లా వ్యవసాయాధికారి గోవింద్‌నాయక్‌, డీఆర్డీఏ పీడీ ఉమాదేవి, పౌరసరఫరాల అధికారి కాశీవిశ్వనాథ్‌, డీఎం ఇర్ఫాన్‌, డీపీఎం అరుణ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పశుగణన సర్వే

వనపర్తిన్యూటౌన్‌: జిల్లాలో పశుగణన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్‌ ఆదర్శ్‌ సురభి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశుగణన సర్వేకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 28 వరకు 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని రకాల పశువులను ప్రత్యేయాప్‌ ద్వారా గణించాల్సి ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటికి వచ్చే సిబ్బందికి ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు, కోళ్లు, కుక్కలు మొదలైన పశువుల సమగ్ర సమాచారం చెప్పాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్‌ నగేశ్‌, డీఆర్డీవో పీడీ ఉమాదేవి, పశుసంవర్ధకశాఖ అధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు ఏర్పాట్ల పరిశీలన



మద్దూరులో సీఎం పర్యటన ఏర్పాట్లను సమీక్షిస్తున్న కలెక్టర్‌, ఎస్పీ

మద్దూరు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం నారాయణపేట జిల్లాలో పర్యటించనున్నారు. ఇటీవల మరణించిన కాంగ్రెస్‌ నాయకుడు కల్లపు సతీశ్‌ దశదినకర్మ సందర్భంగా సీఎం ఉదయం 11 గంటలకు మద్దూరుకు చేరుకొని సతీశ్‌ కుటుంబ సభ్యులను పరామర్శించనున్నారు. నిడ్జింత రోడ్డులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ స్థలాన్ని శుక్రవారం కలెక్టర్‌ సిక్తాపట్నాయక్‌, ఎస్పీ యోగేశ్‌గౌతంలు పరిశీలించారు. ముఖ్యమంత్రికి స్వాగతం పలికే వారి కోసం ప్రత్యేకంగా టెంట్‌ ఏర్పాటు చేస్తున్నారు. హెలిప్యాడ్‌ దగ్గర జిల్లా అధికారులతో పాటు 10 మంది వరకు మాత్రమే ఉండాలని ఎస్పీ నాయకులకు సూచించారు. ఆర్‌అండ్‌బీ, పోలీసు, రెవెన్యూ, విద్యుత్తు, అగ్నిమాపక, ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్‌ ఆదేశించారు. సీఎం వెళ్లే పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని కలెక్టరు అధికారులను ఆదేశించారు. కడా అధికారి వెంకట్‌రెడ్డి, అదనపు ఎస్పీ రియాజ్‌ ఉల్‌ హక్‌, ఆర్డీవో మధుమోహన్‌, కోస్గి సీఐ దస్రునాయక్‌, డీసీసీ అధ్యక్షులు కె.ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, మండల నాయకులు నర్సిములు, రఘుపతిరెడ్డి తదితరులు ఏర్పాట్లను పరిశీలించిన వారిలో ఉన్నారు.

ప్రభుత్వానికి పేరొస్తుందనే రాద్ధాంతం

గ్రూప్‌-I అభ్యర్థులను ప్రతిపక్షాలు రెచ్చగొట్టాయి : మంత్రి శ్రీధర్‌ బాబు



మాట్లాడుతున్న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

పాలమూరు,. న్యూస్‌టుడే : రాష్ట్రంలో రాత పరీక్ష నిర్వహించి గ్రూప్‌-1 పోస్టులు భర్తీ చేస్తే కాంగ్రెస్‌ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్న భయంతోనే ప్రతిపక్షాలు అభ్యర్థులను రెచ్చగొట్టాయని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మండిపడ్డారు. మహబూబ్‌నగర్‌ పట్టణం మెట్టుగడ్డలోని ఐటీఐ ప్రాంగణంలో ఏర్పాటు చేసే అధునాతన సాంకేతిక కేంద్రం(ఏటీసీ)కు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రూప్‌-1 ఉద్యోగాల ప్రకటన ఈ ఏడాది ఫిబ్రవరిలో వచ్చిందని, ప్రిలిమ్స్‌ పూర్తయి మెయిన్స్‌కు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాక ప్రతిపక్షాలు కుట్రలు చేశాయని ఆరోపించారు. పరీక్షకు నాలుగు రోజుల ముందు నుంచి అభ్యర్థులతో ధర్నాలు, నిరసనలు, ఆందోళనలు చేయించాయని ఆరోపించారు. 9 నెలల నుంచి రాని అనుమానం.. ఇప్పుడు ఎందుకు వచ్చిందని ఆయన ప్రశ్నించారు. 2011లో తాము అధికారంలో ఉన్నప్పుడు వేసిన గ్రూప్‌-1 ప్రకటనతో అనేక మందికి ఉద్యోగాలు ఇచ్చామని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్‌ ప్రభుత్వం 2024లో గ్రూప్‌-1 ప్రకటన ఇచ్చిందన్నారు. 500 పైచిలుకు ఉద్యోగాలను భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. భారాస 10 ఏళ్లలో 40వేల ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేసిందని, అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే 50వేల కంటే ఎక్కువ ఉద్యోగాలను భర్తీ చేసిన ఘనత తమకుందన్నారు. రాబోయే కాలంలో మరిన్ని ఉద్యోగ ప్రకటనలు ఇస్తామన్నారు. తమది మాటల ప్రభుత్వం కాదని, చేతలదని పేర్కొన్నారు. రాష్ట్రంలో 65 ఐటీఐ కళాశాలలను రూ.2,300 కోట్ల నిధులు వెచ్చించి ఆధునికీకరిస్తున్నట్లు తెలిపారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ జాతీయ రహదారి ఎక్కువ భాగం తన నియోజకవర్గం గుండా వెళ్తోందని, అన్ని రకాల వసతులు ఉన్నందున పరిశ్రమలు కేటాయించాలని కోరారు. మక్తల్‌ ఎమ్మెల్యే శ్రీహరి మాట్లాడుతూ కృష్ణానది అవతలి వైపు థర్మల్‌ పవర్‌ స్టేషన్‌ ఉండటంతో అక్కడి నిరుద్యోగులకు ఉద్యోగాలు దక్కాయని, మనవైపు కూడా అలాంటిది ఏర్పాటు చేయాలన్నారు. మహబూబ్‌నగర్‌, షాద్‌నగర్‌, మక్తల్‌, దేవరకద్ర ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్‌, తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ ఛైర్మన్‌ ఒబేదుల్లా కొత్వాల్‌, మహబూబ్‌నగర్‌ కలెక్టర్‌ విజయేందిర బోయి, ఎస్పీ జానకి పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలు మార్చేలా బోధన



మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి గోవిందరాజులు

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే : ఉపాధ్యాయులు జీతం కోసం కాకుండా విద్యార్థుల జీవితాలను మార్చే వారిగా రాణించాలని జిల్లా విద్యాధికారి గోవిందరాజులు పిలుపునిచ్చారు. జిల్లాలోని నూతన ఎస్జీటీలకు పట్టణంలోని జిల్లా పరిషత్‌ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా విద్యాధికారి మాట్లాడుతూ నూతన ఉపాధ్యాయులుగా ఎన్నికైన ఎస్జీటీలకు వారం రోజులోనే శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం రాష్ట్రంలో తొలిసారి అన్నారు. ప్రాథమిక పాఠశాల స్థాయిలోనే వారికి దృఢమైన పునాదులు వేయాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో నైపుణ్యం మెరుగుపరుచుకుని ఉత్తమ బోధన అందించేందుకు కృషి చేయాలన్నారు. ఉత్తమ బోధన చేసి మంచి ఉపాధ్యాయులుగా గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. శిక్షణకు 52 మంది నూతన ఎస్జీటీలు హాజరయ్యారు. వారికి డీసీఈబీ కార్యదర్శి సూర చంద్ర వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో మద్దిలేటి, ఏఎంవో మహానంది, పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఉమాదేవి, ఉపాధ్యాయుడు శంకర్‌ గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి పట్టణాభివృద్ధి సంస్థ ఆవిర్భావం

వనపర్తి న్యూటౌన్‌, న్యూస్‌టుడే : వనపర్తి పట్టణాభివృద్ధి సంస్థను విస్తారంగా ఏర్పాటు చేయడంతో జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న పలు మండలాల్లోని గ్రామాలు అభివృద్ధికి నోచుకోనున్నాయి. వుడా కింద 35 కి.మీ. పరిధిలోని గ్రామాలను చేర్చడంతో ఆయా గ్రామాల అభివృద్ధికి బీజం పడినట్లైంది. వుడా కింద వనపర్తి, పెబ్బేరు, కొత్తకోట, ఆత్మకూరు, అమరచింత పురపాలికలతో పాటు 30 కి.మీ. పరిధిలోని గ్రామాలను చేర్చారు. వనపర్తి చిన్న జిల్లా కావడంతో దాదాపు మొత్తం వచ్చినట్లయ్యింది. అమరచింత మండలంలో 13 గ్రామాలు, మదనపురం 16, పెద్దమందడి 13, ఖిల్లాగణపురం 19, గోపాల్‌పేట 8, రేవల్లి 7, పాన్‌గల్‌ 22, వనపర్తి 18, కొత్తకోట 21, ఆత్మకూరు 14, పెబ్బేరు 19, శ్రీరంగాపురం 8, వీపనగండ్ల 11, చిన్నంబావి 17, ఏదుల మండలంలో ఒక గ్రామాన్ని చేర్చారు.

దాశరథి జీవితం ఆదర్శప్రాయం



మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్‌

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: తెలంగాణ కవిత్వాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడు దాశరథి జీవితం అందరికీ ఆదర్శప్రాయమని ఎస్పీ రావుల గిరిధర్‌ పేర్కొన్నారు. శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కో-ఎడ్‌ కళాశాలలో తెలంగాణ సాహిత్య అకాడమి, తెలుగు భాషా చైతన్య సమితి సంయుక్తంగా దాశరథి శత జయంతి వేడుకలు, కవి సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్పీ హాజరై తెలంగాణ ప్రభుత్వం సాహితీ త్రైమాసిక పత్రిక 'పునాస' పుస్తకాన్ని కళాశాల వైస్‌ ప్రిన్సిపల్‌ ఉమాతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. నిజాం నిరంకుశ పాలనపై తన రచనలతో తెలంగాణ ప్రజలను చైతన్యపరచి పోరాటం చేసిన గొప్ప కవి దాశరథి అని కొనియాడారు. రానున్న రోజుల్లో దేశాన్ని పాలించే యువత మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలని సూచించారు. వ్యాస రచన, ఉపన్యాస పోటీల్లో మొదటి స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందించారు. కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమి కార్యదర్శి నామోజు బాలచారి, తెలుగు భాషా చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు బడేసాబ్‌, రాచాల యుగంధర్‌ గౌడ్‌, సాహిత్య వేత్తలు నాళేశ్వరం శంకరం, పెబ్బేటి మల్లికార్జున్‌, మనోహర్‌ రెడ్డి, సరోజినిదేవి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆవిష్కరణలకు అవకాశం ఇవ్వమా?

- ఇన్‌స్పైర్‌ మనక్‌కు 3,858 రిజిస్ట్రేషన్లు
- ప్రైవేటు పాఠశాలల ప్రాతినిధ్యం అంతంతే



జాతీయ స్థాయి ప్రదర్శనలో వరి ధాన్యం అరబెట్టే పరికరం పనితీరు వివరిస్తున్న విద్యార్థిని

న్యూస్‌టుడే, నారాయణపేట పట్టణం

ప్రతి విద్యార్థిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుంది. దాన్ని వెలికితీసి ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక అభివృద్ధి మంత్రిత్వశాఖ ఏటా దేశ వ్యాప్తంగా నిర్వహించే ఇన్‌స్పైర్‌, మనక్‌ ద్వారా విద్యార్థుల్లో సృజనకు పదును పెడుతోంది. మనిషి జీవితంలో నిత్యం ఎదురయ్యే సమస్యలకు పరిష్కారాలు చూపించే ప్రాజెక్టులను ఆన్‌లైన్‌ ద్వారా ఆహ్వానిస్తోంది. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ప్రతిభ కనబరిచిన వాటిని జాతీయ, అంతర్జాతీయ ప్రదర్శనలకు సైతం పంపుతారు. 2024-25 ఏడాదికి రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని పలుమార్లు విద్యాశాఖ అవగాహన కల్పించినా చాలా మంది ముందుకు రాలేదు. ప్రైవేటు పాఠశాలల నుంచి కనీస స్పందన కొరవడుతోంది. కేవలం నాలుగు ప్రైవేటు పాఠశాలలే ఇందులో పాల్గొన్నాయని, ఎన్ని ఎక్కువ పాఠశాలలు ప్రాతినిధ్యం వహిస్తే అంత మేలు జరుగుతుందని నారాయణపేట జిల్లా సైన్స్‌ అధికారి భానుప్రకాశ్‌ 'న్యూస్‌టుడే'తో అన్నారు.

2024 - 25లో నామినేషన్లు ఇలా..

మహబూబ్‌నగర్‌	1061
వనపర్తి	1041
నాగర్‌కర్నూల్‌	847
గద్వాల	595
నారాయణపేట	315

తయారీ ఖర్చులకు రూ. 10 వేలు : అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో 6 నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులు గైడ్‌ టీచరు సహాయంతో ప్రాజెక్టు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ప్రతి పాఠశాల నుంచి 5 ప్రాజెక్టులను పంపించాలి. ఎంపికైన విద్యార్థుల బ్యాంకు ఖాతాలో రూ. 10 వేలు జమ చేస్తారు. ఈ నిధులతో ప్రాజెక్టు తయారు చేసి జిల్లా స్థాయిలో ప్రదర్శించాల్సి ఉంటుంది. ఇక్కడ ప్రతిభ కనబరిస్తే రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొనే అవకాశం ఉంటుంది.

రాష్ట్రపతి భవన్‌, జపాన్‌ సందర్శన : జాతీయ స్థాయికి ఎంపికైన వారికి రూ. 25 వేల ప్రోత్సాహకం అందజేస్తారు. అక్కడ ప్రతిభ చాటితే రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేసే విందు భోజనానికి హాజరయ్యే అవకాశం లభిస్తుంది. ఈ ప్రాజెక్టుకు పేటెంట్‌ హక్కు కల్పిస్తారు. వీరికి దేశంలో పేరున్న ఐఐటీల్లో ప్రవేశాలకు రిజర్వేషన్‌ కల్పిస్తారు. అలాగే జపాన్‌ సందర్శనకు అవకాశం ఇస్తారు.

ఉమ్మడి జిల్లా నుంచి...: 2022-23 విద్యా సంవత్సరంలో నారాయణపేట నుంచి రెండు ప్రాజెక్టులు జాతీయ స్థాయికి ఎంపికయ్యాయి. అచ్చంపేట సాయినగర్‌ కాలనీ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని అంజలి తయారు చేసిన ప్రాజెక్టు కూడా ఎంపికయ్యింది. వీరికి ప్రశంసలు వెల్లువెత్తాయి. 2023-24 లో ఎంపికైన ప్రాజెక్టులను ఈ ఏడాది ప్రదర్శనలకు ఉంచనున్నారు. నాగర్‌కర్నూల్‌ జిల్లా 66, వనపర్తి 54, మహబూబ్‌ నగర్‌ 5, జోగులాంబ గద్వాల 44, నారాయణపేట నుంచి 18 ప్రాజెక్టులు వివిధ స్థాయిలకు ఎంపికయ్యాయి.

వేతనాలు లేక వెతలు

● మూడు నెలలుగా పారిశుద్ధ్య కార్మికుల పరేషాన్

● పండగ వేళ అవస్థలు



పెద్దకొత్తపల్లిలో తెల్లవారుజామునే బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న పారిశుద్ధ్య కార్మికులు

న్యూస్‌టుడే, కొల్లాపూర్ గ్రామీణం, కల్వకుర్తి : పల్లెల పరిశుభ్రతకు కీలకమైన పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలందడం లేదు. రెండు నెలలుగా అప్పులతో కాలం వెళ్లదీస్తున్నారు. దసరా పండగకు వేతనాలు రాకపోగా కనీసం దీపావళికైనా వస్తాయోనన్న ఆశతో కార్మికులు ఉన్నారు. సకాలంలో రాకుంటే పండుగకు పస్తులుండాల్సిందేనా అని పారిశుద్ధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది.

● గ్రామపంచాయతీలకు ప్రస్తుతం నిధులు కూడా సరిగా రావటం లేదు. ఒప్పంద కార్మికులుగా నియమించుకున్నప్పటికీ పారిశుద్ధ్య కార్మికులకు నెలనెలా వేతనాలు అందడం లేదు. పంచాయతీల్లో పన్నుల వసూలు అంతంతమాత్రంగానే ఉంటోంది. దీంతో పంచాయతీల నిర్వహణ భారంగా మారింది. నిత్యం శ్రమకోర్చి రహదారులు ఊడ్చటం, చెత్త తొలగింపు, మురుగు కాల్వల శుభ్రత వంటి పనులు చేపట్టడుతున్నా.. కార్మికులను విస్మరిస్తున్నారు. నిత్యం ఉపాధి హామీపనులకు హాజరైనా నెలకు దాదాపు రూ. 6వేలకు పైగానే అందుకునే వీలుంది. పారిశుద్ధ్య కార్మికులు నిత్యం విధులకు వెళ్తున్నా సకాలంలో వేతనాల అందడం లేదు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 7,420 మంది పారిశుద్ధ్యకార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వీరికి గత జులై వరకే వేతనాలు అందించారు. ఆగస్టు నుంచి ఇప్పటివరకు వేతనాలు ఇవ్వలేదు.

ఉమ్మడి జిల్లాలో మొత్తం పంచాయతీలు **1,684**
పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు **7,420**
మూడు నెలల వేతన బకాయిలు **రూ.14.09 కోట్లు**

కార్యదర్శులపై ఒత్తిడి : రెండు నెలలుగా పంచాయతీలకు కూడా నిధులు సరిగా రావడంలేదు. దీంతో పంచాయతీల్లో ట్రాక్టర్ల నిర్వహణ, డీజిల్ కొనుగోలు, ఇతర ఖర్చులతోడై పంచాయతీలు అప్పుల కుప్పగా మారుతున్నాయని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో కొత్తగా ఏర్పడిన చిన్న పంచాయతీలు 550 దాకా ఉన్నాయి. వీటి నిర్వహణ మరింత భారంగా మారింది. కొన్ని చోట్ల కార్యదర్శులు అప్పులు తెచ్చి పారిశుద్ధ్య కార్మికుల చేతి ఖర్చులకు ఇస్తున్నారు. ప్రస్తుతం సర్పంచులు లేక పోవడంతో ప్రత్యేకాధికారుల పాలనలో కార్యదర్శులపై ఒత్తిడి పెరిగింది. నిధులు లేక వేతనాలు ఇవ్వలేక ఇబ్బంది పడాల్సి వస్తోంది.

నిత్యం అప్పులతో..: రెండు నెలలుగా వేతనాలు లేక అప్పులు చేసి కుటుంబాలను నెట్టుకొస్తున్నాం. గ్రామాల్లో పెద్ద పండుగ దసరా మా ఇళ్లల్లో చిన్నబోయింది.. దీపావళి కూడా జరుపుకొనే పరిస్థితి కన్పించడంలేదు. సరకులు కొందామన్నా ఆర్థిక ఇబ్బందులతో మా పరిస్థితి దయనీయంగా ఉంది.



- రాజేందర్, పెద్దకొత్తపల్లి పారిశుద్ధ్యకార్మికుడు

ఒక నెల సర్దుబాటు చేస్తాం..: పారిశుద్ధ్య కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాల్సి ఉంది. ప్రస్తుతం ఒక నెల వేతనాల నిధులు మంజూరయ్యాయి. వీటిని అందించేందుకు ఇప్పటికే ఆయా మండలాలకు వివరాలు పంపాలని సూచించాం. నివేదికలు రాగానే ప్రస్తుతానికి ఒక నెల వేతనాలు అందిస్తాం.

- రామ్మోహన్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి, నాగర్‌కర్నూల్

భావి తరం నిర్మాతలు మీరే

నవ, యువ గురువులారా.. అహర్నిశలు శ్రమించి.. పోటీని తట్టుకుని నిలబడి ఉత్తమమైన ఉపాధ్యాయ వృత్తి చేపట్టారు. భావి పౌరులను తీర్చిదిద్దే సువర్ణ అవకాశం మీ చేతుల్లోకి వచ్చింది. ఇతర శాఖల్లోని ఉద్యోగాలను సైతం వదులుకుని వచ్చిన వారూ మీలో ఉన్నారు. మనచుట్టూ ఉండే ఎంతోమంది గురువుల నుంచి అనుసరించిన పద్ధతులను మీరూ అలవరుచుకోవచ్చు. జీతం కోసమే ఉద్యోగం కాదు.. ఎన్నో జీవితాలను బాగుచేసే యజ్ఞం చేస్తున్నారని గుర్తించండి.

- న్యూస్‌టుడే కోస్గి, గద్వాల న్యూటౌన్

బడి బాట పట్టించండి

ఎంతో మంది చిన్నారులు వివిధ కారణాలతో బడి మానుకుంటున్నారు. కొందరు తల్లిదండ్రులతో వలస పోతే, మరి కొందరు పనులకు వెళ్తున్నారు. తల్లిదండ్రులకు చదువు ప్రాముఖ్యాన్ని వివరిస్తూ బడికి పంపేలా ఒప్పించాలి.



హన్వాడలో పిల్లలను బడిబాట పట్టిస్తున్న ఉపాధ్యాయులు

● **ఉదాహరణ:** హన్వాడ పాఠశాలలో పనిచేస్తున్న జయప్రద ప్రతి వారం విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేలా ఆటలు, పాటలు సాంస్కృతిక కార్యక్రమాలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహిస్తున్నారు. పిల్లల ఇంటికి వెళ్లి తల్లిదండ్రులను ఒప్పించి బడికి పంపేలా చూస్తున్నారు.

కృత్యాధార బోధన

మామూలుగా చెప్పేదాని కన్నా కృత్యాలతో చేసి చూపిస్తే పిల్లల మనసుల్లో నాటుకుంటుంది. అందుకు కావలసింది ఓపిక, సృజనాత్మక ఆలోచనలే.

● మహబూబ్‌నగర్ జిల్లా వేపూర్‌లో పనిచేస్తున్న దశరథరాంరెడ్డి కృత్యాలతో ఆకట్టుకుంటున్నారు. ఒక్కొక్క తరగతికి భిన్న నమూనాలు అమలు చేస్తున్నారు. ధన్వాడ, చిన్నపొర్ల పాఠశాలల్లో అక్షరమాలలు, అట్టపెట్టలతో చతుర్విధ ప్రక్రియలను తయారు చేసి ఉపాధ్యాయులు ఔరా అనిపించారు.



వేపూర్‌లో విద్యార్థులతో మమేకమై బోధిస్తున్న దశరథరాంరెడ్డి

మంచి అలవాట్లు నేర్పించాలి

గురువులు ఏది అనుసరిస్తే విద్యార్థులు ఆ మార్గంలో పయనిస్తారు. ఎంతోమంది గొప్ప వ్యక్తులు తమ జీవితాలపై పాఠశాలలో గురువుల ప్రభావం ఉందని చెబుతారు. బాల్యదశలో మంచి అలవాట్లు నేర్పిస్తే పిల్లలు ఉన్నతంగా ఎదుగుతారు.

● **ఉదాహరణ:** ఊట్కూరు మండలం చిన్నపొర్ల పాఠశాలలో పనిచేస్తున్న నరేందర్ పిల్లలకు చదువు తప్ప ఇతర పనులు చెప్పకుండా తల్లిదండ్రులను చైతన్యపరిచారు. ఉదయం అయిదు గంటలకు లేచి చదువుకునేలా ప్రోత్సహించారు. ఇంతకు ముందు తాను పనిచేసిన మదిపల్లితండాలో 22 మంది విద్యార్థులను గురుకుల పాఠశాలకు ఎంపికయ్యేలా తీర్చిదిద్దారు. వ్యక్తిగత పరిశుభ్రత, శ్రమ విలువ నేర్పారు.



చిన్నపొర్లలో బోధిస్తున్న నరేందర్

సామాజిక బాధ్యత చెప్పాలి

భవిష్యత్తు బాధ్యత వారిదే అనే విధంగా విద్యార్థులను సమాయత్తం చేయాల్సిన అవసరం ఉంది. విలువలు, సామాజిక బాధ్యత చెప్పాలి.


● వనపర్తి జిల్లా యాపర్ల ఉన్నత పాఠశాలలో శంకర్ గౌడ్ అమ్మనాన్నలకు నిత్యం పాదపూజ చేసే పాఠశాలగా రావాలని చిన్నారులకు సూచిస్తూ అలవాటుగా మార్చారు. బాల్య వివాహాలను అడ్డుకొని పోలీసులతో కలిసి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కోస్గి మండలం ముశ్రీఫా జడ్పీ ఉన్నత పాఠశాలలో వార్ల మల్లేశం ప్లాస్టిక్ నిషేధం, మొక్కల పెంపకం, పరిసరాల పరిశుభ్రత, పక్షుల సంరక్షణ వంటి పనులను ప్రత్యక్షంగా పిల్లలతో చేయిస్తున్నారు.



బాల్యవివాహాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న శంకర్

ఇటీవల డీఎస్సీలో ఎంపికై కొత్తగా 951 మంది ఉపాధ్యాయులు ఉమ్మడి జిల్లాకు వచ్చారు. .

జిల్లా	ఎస్ఏ	భాషా పండితులు	పీఈటీ	ఎస్జీటీ	స్పెషల్ ఎడ్యుకేషన్
మహబూబ్‌నగర్	35	22	07	144	06
నాగర్‌కర్నూల్	66	13	02	129	0
జోగులాంబ గద్వాల	34	26	08	77	04
నారాయణపేట	70	22	01	154	05
వనపర్తి	55	08	06	52	05



వృత్తికి న్యాయం చేయాలి

వృత్తికి కట్టుబడి ఉండాలి. ఎంతో నమ్మకంతో గురువుల చేతిలో పిల్లలను పెడతారు. తాను చేస్తున్నది ఉద్యోగం కాదని, సమాజ నిర్మాణంలో భాగస్వామ్యమని గుర్తించాలి.

● నాగర్‌కర్నూల్ జిల్లా చిన్నముద్దునూర్ పాఠశాలలో రాజశేఖర్‌రావు ఈ విషయంలో ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకున్నారు. ఈయన ప్రతి పిల్లాడిపై ప్రత్యేక శ్రద్ధపెట్టి ఎదిగేలా చూస్తున్నారు.



ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు అందుకుంటున్న రాజశేఖర్ రావు

ఆట,పాటలకు ప్రాధాన్యం



విద్యార్థులకు సైక్లింగ్ పోటీలను నిర్వహిస్తున్న భూపని గోపాలం

పిల్లలకు ఆటలు దూరం కావడంతోనే నేడు ఎన్నో అనర్థాలు జరుగుతున్నాయి. విద్యార్థుల్లో శారీరక దృఢత్వం ఉంటే వారు ఇష్టంగా చదువుపై ఆసక్తి కనబరుస్తారు.

● మక్తల్‌కు చెందిన భూపని గోపాలం పనిచేసిన సమయంలో ఎంతోమందిని తీర్చిదిద్దారు. పదవీ విరమణ తరువాత వచ్చిన డబ్బుతో పేదపిల్లలను క్రీడాకారులుగా తీర్చిదిద్దారు. జాతీయ స్థాయికి 62 మంది వెళ్లగలిగారంటే ఆయన నిబద్ధతను ప్రశంసించాల్సిందే. క్రీడాపాఠశాలకు 42 మంది విద్యార్థులు ఎంపికకావడానికి ప్రత్యేక శిక్షణ అందించారు. క్రీడాకారులకు తన సొంతడబ్బులతో పాటు దాతల నుంచి సేకరించిన నగదుతో అన్ని వసతులు సమకూర్చుతున్నారు.

ఇథనాల్ కంపెనీ సందర్శనను అడ్డుకున్న పోలీసులు




గుండ్లంపల్లి గ్రామస్థులను అడ్డుకున్న మరికల్ పోలీసులు

మరికల్ కూడలి, న్యూస్‌టుడే : నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో ఏర్పాటు చేయతలపెట్టిన ఇథనాల్ ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్న గుండ్లంపల్లి గ్రామస్థులు నారాయణపేట జిల్లా మరికల్ మండలం చిత్తనూర్ ఇథనాల్ ప్రాజెక్టును, పరిసర గ్రామాలను సందర్శించడానికి శుక్రవారం వచ్చారు. వంద మంది రెండు బస్సుల్లో వచ్చారని తెలుసుకున్న పోలీసులు శుక్రవారం తెల్లవారుజామున మరికల్ పోలీసు స్టేషన్ వద్ద బస్సులను నిలిపేశారు. సందర్శనకు ఎలాంటి అనుమతి లేదంటూ బస్సుల్ని వెనక్కి మళ్లించి పోలీసు సహాయంతో జడ్చర్ల వరకు తీసుకెళ్లి వదిలేశారు. ఈ సంఘటనపై చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఈ పర్యటనను అడ్డుకోవడం ఏమిటని ప్రజాసంఘాల నాయకులు ఎం.రాఘవచారి, డి.చంద్రశేఖర్, ఎస్ఎం ఖలీల్, జె.చక్రవర్తి ప్రభుత్వాన్ని నిలదీశారు. పాలకులు మారినా పరిస్థితి మారలేదన్నారు. రాబోయే రోజుల్లో మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

పట్టుదలతో సాధన చేస్తే విజయం తథ్యం

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



కల్వకుర్తి జట్టుకు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి పట్టణం, న్యూస్‌టుడే : లక్ష్యాలను నిర్దేశించుకుని పట్టుదలతో సాధన చేస్తే తప్పక విజయం వరిస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని ఎంజేపీ బాలికల గురుకుల విద్యాలయంలో మూడు రోజులుగా జరుగుతున్న ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-17 క్రీడలు శుక్రవారం ముగిసాయి. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. చిన్నతనం నుంచే క్రీడాసాధన చేస్తే శారీరకంగా, మానసింగా దృఢంగా ఉంటారని దాని వల్ల జీవితంలో ఎలాంటి పరిస్థితులు నెలకొన్నా తట్టుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. మొత్తం 16 పాఠశాలల నుంచి 540 మంది క్రీడాకారులు పోటీ పడినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దేవసహాయం, ఆర్డీవో వెంకట్‌రెడ్డి, కాలుష్య నియంత్రణా మండలి సభ్యుడు బాలాజీసింగ్, ప్రిన్సిపల్ నాగమణి, వ్యాయామోపాధ్యాయురాలు సింధు, ఫుట్‌బాల్ అసోషియేషన్ సభ్యుడు కేశవులు, కౌన్సిలర్‌లు బాలునాయక్, రవిందర్, నాయకులు సురేందర్‌రెడ్డి, సతీష్, సీఐ నాగార్జున పాల్గొన్నారు.

క్రీడ	విజేత	రన్నర్
కబడ్డీ	కల్వకుర్తి	తాడూర్
వాలీబాల్	కల్వకుర్తి	నర్వ
ఖోఖో	కల్వకుర్తి	ఉయ్యాలవాడ
చెస్	కల్వకుర్తి	వేపూర్
క్యారం	హన్వాడ	వెల్టూర్

విజేతలు వీరే..

మూడు రోజుల పాటు జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలు హోరాహోరీగా జరిగాయి. అత్యధిక క్రీడల్లో కల్వకుర్తి పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ఓరల్ ఛాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నారు.

బాలిక మృతిపై అనుమానాలెన్నో...!

ప్రభుత్వ వ్యవస్థల తీరుపై విమర్శలు

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: మల్దకల్ మండలం బిజ్వారం గ్రామానికి చెందిన బాలిక ఆత్మహత్యలో అనేక అనుమానాలు, పలు కోణాలు వెలుగుచూస్తున్నాయి. దొంగతనం జరిగింది గద్వాలలో అయితే మల్దకల్ పోలీసుస్టేషన్‌లో ఎలా విచారించారనే దానికి సమాధానం దొరకడం లేదు. దొంగతనం, పోలీసుల విచారణ భయంతో అవమానంగా భావించి బాలిక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి కర్నూల్ ఆసుపత్రిలో మృతిచెందిన విషయం తెలిసిందే. బాలిక ఆత్మహత్యకు యత్నించిదనే విషయం బహిర్గతం కావడంతో తొలుత కార్మిక శాఖ, ఆ తరువాత జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖలు స్పందించాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు ఆయా శాఖల్లో స్పందన లేదు. దీనిపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పోలీసులు విచారణ, కేసులు అంటున్నారు తప్పితే బాలికకు చట్టబద్ధంగా సంక్రమించిన హక్కులను విస్మరించారని పలువురు మహిళా సంఘాల నేతలు అభిప్రాయపడుతున్నారు. బాలికపై దొంగతనం అభియోగం మోపిన వెంటనే మైనర్లను పనిలో ఎలా పెట్టుకున్నారని ప్రశ్నించి ఉంటే ఈ రోజు బాలిక మృతిచెంది ఉండేది కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ దిశగా పోలీసులు ఎందుకు విచారణ చేపట్టలేదనే విషయం వెలుగులోకి రావాల్సి ఉంది. గత కొంత కాలంగా జిల్లాలో అధికార వ్యవస్థలు నాయకుల పలుకుబడి ముందు చట్ట నిబంధనలు పనికి రానివిగా చేస్తున్నారని న్యాయనిపుణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కర్నూల్ ఆసుపత్రికి వెళ్లాం: బాలిక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన విషయం తెలిసిన వెంటనే కమిటీ సభ్యులం కర్నూల్‌లో చికిత్స పొందుతున్న ఆసుపత్రికి వెళ్లాం. అప్పటికే బాలిక ఆపస్మారక స్థితిలో ఉంది. ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగాం. వారు ఏమీ చెప్పలేమనడంతో వివరాలు నమోదు చేసుకుని తిరిగి వచ్చాం.

-సుధారాణి, జిల్లా సంక్షేమ అధికారిణి

29న ఎస్‌జీఎఫ్ అండర్-19 బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 బాస్కెట్‌బాల్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్లను ఈనెల 29న జిల్లా కేంద్రంలోని డీఎస్‌ఏ మైదానంలో ఎంపికలు చేపడుతున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పాపిరెడ్డి శుక్రవారం తెలిపారు. బోనఫైడ్, పదో తరగతి మార్కుల జాబితా జిరాక్స్‌తో ఉదయం 9గంటలకు కోచ్ ఖలీల్‌ను నివేదించాలని సూచించారు.

పోటీలే లక్ష్యంగా ఆడండి



జట్లతో క్రికెట్ సంఘం ప్రతినిధులు

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే: హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అంతర్ జిల్లాల అండర్-23 క్రికెట్ టోర్నీలో సత్తా చాటితే తప్పక రంజీ స్థాయికి ఎదగవచ్చని ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ అన్నారు. శుక్రవారం ఎండీసీఏ క్రికెట్ మైదానంలో ఉమ్మడి జిల్లా క్రికెట్ టోర్నీ మూడో రోజు నాగర్‌కర్నూల్- వనపర్తి మధ్య నిర్వహించిన వన్డే మ్యాచ్‌ను ప్రారంభించి మాట్లాడారు. ఈ ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చాటితే తప్పకుండా తుది జట్టులో చోటు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎండీసీఏ ఉపాధ్యక్షుడు టి.సురేశ్ కుమార్, అశోక్, సభ్యులు గోపాలకృష్ణ, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్ విజయం: అండర్-23 అంతర్ జిల్లాల టోర్నీలో నాగర్‌కర్నూల్ జట్టు వనపర్తి జట్టుపై 16 పరుగుల తేడాతో విజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన నాగర్‌కర్నూల్ జట్టు 44.2 ఓవర్లలో 169 పరుగులకు ఆలౌట్ అయింది. తరుణ్ 35, సాయిరాం 19, కృష్ణ 18 పరుగులు చేశారు. వనపర్తి బౌలింగ్‌లో ఛత్రపతి 4, దినేశ్, ప్రణీత్ రెడ్డి చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం వనపర్తి జట్టు 31 ఓవర్లలో 153 పరుగులకు ఆలౌట్ అయింది. అభిషేక్‌గౌడ్ 56, ప్రణీత్ 34 పరుగులు చేశారు. నాగర్‌కర్నూల్ నుంచి అభినవ్ 4, జశ్వంత్ 2 వికెట్లు తీశారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



అండర్ 17 ఓవరాల్ ఛాంపియన్ షిప్ సాధించిన పాత మక్తల్ ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులకు షీల్డ్ అందజేస్తున్న వనపర్తి జిల్లా బీసీ గురుకుల కన్వీనర్ మేఘూరావు

వనపర్తిగ్రామీణం, న్యూస్‌టుడే : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించేలా ఎంజేపీ సొసైటీ ఏటా వారికి జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తోందని వనపర్తి జిల్లా బీసీ గురుకుల పాఠశాలల కన్వీనర్ మేఘూరావు అన్నారు. శుక్రవారం మండలంలోని చిట్యాల బీసీ గురుకుల పాఠశాలలో ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహించిన అండర్-17 క్రీడా పోటీల విజేతలకు ప్రిన్సిపల్ గురువయ్యగౌడ్‌తో కలిసి ఆయన బహుమతులు అందజేశారు. ఓవరాల్ ఛాంపియన్‌గా మక్తల్ బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు నిలిచారు. మక్తల్ గురుకుల పాఠశాల విద్యార్థి జి.శివ వ్యక్తిగత ఛాంపియన్ షిప్ బహుమతి అందుకున్నారు. కబడ్డీలో ప్రథమ స్థానంలో నవాబ్‌పేట గురుకుల పాఠశాల, ద్వితీయ స్థానంలో మక్తల్, ఖోఖోలో నవాబ్‌పేట ప్రథమ, ద్వితీయ చిట్యాల, వాలీబాల్‌లో మక్తల్ ప్రథమ, సీసీ కుంట ద్వితీయ, టెన్నికాయిట్‌లో చిట్యాల ప్రథమ, ద్వితీయ బూర్గుపల్లి గురుకుల పాఠశాల జట్టు విజేతగా నిలిచింది. చదరంగం పోటీల్లో కడుకుంట్ల ప్రథమ, కేటీ దొడ్డి ద్వితీయ, క్యారమ్స్‌లో సింగోటం ప్రథమ, కడుకుంట్ల ద్వితీయ, డిస్క్ త్రోలో మంజునాథ్ ప్రథమ (ధర్మాపూర్), ద్వితీయ డి.జయంత్ (చిట్యాల), షాట్‌పుట్‌లో ప్రథమ పి.రవీందర్ (చిట్యాల), ద్వితీయ వినయ్ (మక్తల్), హైజంప్, లాంగ్‌జంప్‌లో ప్రథమ కె.అఖిల్‌గౌడ్ (కేటీ దొడ్డి), ద్వితీయ జి.శరత్ (కల్వకుర్తి) నిలిచారు. 400 మీటర్ల రిలే పరుగు పందెంలో ప్రథమ స్థానంలో అంబటి పల్లి గురుకుల విద్యార్థులు, ద్వితీయ స్థానంలో మక్తల్ విద్యార్థులు, 800 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో జి.శివ(మక్తల్), ద్వితీయ స్థానంలో చందు (చిట్యాల), 1500 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ జి.శివ (మక్తల్), ద్వితీయ జి.శరత్ (కల్వకుర్తి), 3 కి.మీ. ప్రథమ కార్తిక్ (అంబటిపల్లి), ద్వితీయ వంశీ (నవాబ్‌పేట), 100 మీటర్లలో ప్రథమ భీముడు (అంబటిపల్లి), ద్వితీయ జి.శివ (మక్తల్), 200 మీటర్లలో ప్రథమ జి.శివ (మక్తల్), ద్వితీయ శరత్ (కల్వకుర్తి), 400 మీటర్లలో ప్రథమ శరత్ (కల్వకుర్తి), ద్వితీయ జి.శివ (మక్తల్) నిలిచారు.

వేలం పాటలతో ఆలయాలకు రూ.3.35 కోట్ల ఆదాయం

అలంపూర్, న్యూస్‌టుడే: అలంపూర్ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయ ఆవరణలో శుక్రవారం దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ మదనేశ్వర్ రెడ్డి, ఈవో పురేందర్, ఆలయ ఛైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, ధర్మకర్త మండలి సభ్యుల సమక్షంలో వేలం పాటలు నిర్వహించారు. మొత్తం రూ.3,35,82,000 ఆదాయం వచ్చినట్లు ఈవో వెల్లడించారు. గతేడాది రూ.1.76 కోట్లతో పోలిస్తే ఈ సారి దాదాపు రెట్టింపు వచ్చినట్లయింది. వేలం పాటలో 40 మందికి పైగా పాల్గొన్నారు. కొబ్బరికాయలు, పూజా సామగ్రి వేలంపాట అత్యధికంగా రూ.1.27 కోట్లు పలికింది. వాహన పార్కింగ్ రూ.77 లక్షలు, చీరలకు రూ.91 లక్షలు, ఫొటోలు, క్యాసెట్లు, పుస్తకాలకు రూ.22 లక్షలు, దేవస్థాన వసతి భవన నిర్వహణకు రూ.9.50 లక్షలు, శౌచాలయాల నిర్వహణకు రూ.7.20 లక్షలు, క్యాంటీన్ నిర్వహణకు నెలకు రూ.76 వేలకు పాటదారులు పాడుకున్నారు. పాట దక్కించుకున్న వారు నవంబరు 24వ తేదీ లోగా 50 శాతం డబ్బులు చెల్లించి డిసెంబరు 1వ తేదీ నుంచి ఆలయాల వద్ద విక్రయాలు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని ఈవో వివరించారు.



వేలం పాట నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

శ్రీపబ్బతి ఆంజనేయస్వామి ఆలయానికి ..

పదర(అమ్రాబాద్), న్యూస్‌టుడే : మద్దిమడుగు శ్రీపబ్బతి ఆంజనేయస్వామి ఆలయంలో కొబ్బరికాయల విక్రయం వేలం మహబూబ్‌నగర్‌లోని దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. అచ్చంపేటకు చెందిన వ్యాపారి నర్సిరెడ్డి రూ.48 లక్షలకు వేలం దక్కించుకున్నారు. అయితే గతేడాది రూ.40.52 లక్షలు పలికింది. కొబ్బరి చిప్పలు, తలనీలాల సేకరణకు సరైన వేలం రాకపోవటంతో వాయిదా వేశారు. త్వరలో మరో తేదీని ఖరారు చేస్తామన్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరమ్మ, ఈవో రంగాచారి, పాలక మండలి ఛైర్మన్ రాములు నాయక్ పాల్గొన్నారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	115-00
రిటైల్	137-00
డ్రెస్డ్	199-00
స్కిన్‌లెస్	226-00

మేమున్నాం.. మీకు తోడుగా.. ఉ॥ 10 గం. నుంచి మ॥ 1 వరకు

మదనాపురం : 8074538150 | వనపర్తి న్యూటౌన్ : 8008573864
అమరచింత : 9490237200 | వీపనగండ్ల : 9121229043



శివాలయం ఎదుట ముళ్లపొదలు

సమస్య: కొత్తకోట మండలం రామకృష్ణాపురం శివాలయం వద్ద ఇళ్ల మధ్య ముళ్లపొదలు ఉండటంతో ఇళ్లలోకి పాములు వస్తున్నాయి. ముళ్లపొదలు తొలగించి సమస్య పరిష్కరించండి. **- అన్నవరం, రామకృష్ణాపురం**

సమాధానం : అక్కడ పాతిల్లు ఉంది. సంబంధీకులు ఇతర ప్రాంతాలకు వెళ్లారు. ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు పెరిగాయి. ఇంటి యజమానికి సమస్య వివరించాం. త్వరలోనే వాటిని తొలగించి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటాం.

- ఖలీద్, పంచాయతీ కార్యదర్శి, రామకృష్ణాపురం



గేట్‌వాల్వ్ లీకేజీతో తాగునీరు వృథా

స: అమరచింత పట్టణంలోని రాజీవ్ గాంధీ కూడలిలో గేట్‌వాల్వ్ లీకేజీతో తాగునీరు వృథా అవుతోంది. నీరు కలుషితమవుతోంది. **- రాములు, అమరచింత**

సమాధానం : గేట్‌వాల్వ్ మరమ్మతు చేయించి వృథా అరికట్టి, స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయిస్తాం.

- వి.మంగమ్మ, పుర ఛైర్‌పర్సన్, అమరచింత

– న్యూస్‌టుడే, కొత్తకోట గ్రామీణం, అమరచింత

బాలల పరిరక్షణ అందరి బాధ్యత



వనపర్తి: మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

వనపర్తిగ్రామీణం, న్యూస్‌టుడే : బాల్య వివాహాలు చేయాలని ప్రయత్నిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ హెచ్చరించారు. శుక్రవారం వనపర్తి మండల పరిషత్ కార్యాలయంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల బాలల పరిరక్షణ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గ్రామాల వారీగా బాలలకు సంబంధించిన సంరక్షణ వ్యవస్థను పటిష్ఠ పరచాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో పద్మావతి, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మమ్మ, సీడీపీవో హాజీరాబేగం, తదితర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే : బాలల రక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రత్యేక ఆఫీసర్, అడిషనల్ డీఆర్డీఓ నాగేంద్ర అన్నారు. శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల బాలల పరిరక్షణ కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి సురేందర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే : బాలల పరిరక్షణ అందరి బాధ్యతని మండల ప్రత్యేక అధికారి రామమహేశ్వర్‌రెడ్డి అన్నారు. గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో చెన్నమ్మ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా బాలల పరిరక్షణ మండల కమిటీని ఏర్పాటు చేశారు. ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

అమరచింత, న్యూస్‌టుడే : సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం బాల బాలికల రక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని డీపీవో సురేశ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో బాలల పరిరక్షణ కమిటీల ఏర్పాటుకు వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బాల్య వివాహాలు అరికడతామని ప్రతిజ్ఞ చేయించారు. బాలల రక్షణ అవగాహన గోడ పత్రిక విడుదల చేశారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



పాన్‌గల్: మాట్లాడుతున్న డీఆర్‌డీవో ఉమాదేవి

శ్రీరంగాపురం, న్యూస్‌టుడే : బాల్య వివాహాలతో అనర్థాలు ఎదురవుతాయని మండల ప్రత్యేకాధికారిణి నుశిత పేర్కొన్నారు. శ్రీరంగాపురంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల బాలల పరిరక్షణ కమిటీని ఎంపీడీవో రవినారాయణ అధ్యక్షతన శుక్రవారం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఆమెతోపాటు, తహసీల్దార్ మురళీగౌడ్ హాజరై మాట్లాడుదారు. బాల్య వివాహ నిరోధక చట్టం గోడపత్రిక ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధికారులు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట, న్యూస్‌టుడే : బాల్య వివాహాలు జరగకుండా కలిసికట్టుగా అడ్డుకుందామని జిల్లా వ్యవసాయాధికారి, గోపాల్‌పేట మండల ప్రత్యేకాధికారి గోవింద్‌నాయక్ అన్నారు. శుక్రవారం బాలల సంరక్షణ మండల కమిటీ ఏర్పాటుకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన సభ్యులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు.

వీపనగండ్ల(చిన్నంబావి), న్యూస్‌టుడే : బాలల సంరక్షణ, బాల్యవివాహాల నిర్మూలన అందరి బాధ్యత అని జిల్లా స్త్రీశిశు సంక్షేమ శాఖ ఇన్‌ఛార్జి అధికారిణి లక్ష్మమ్మ అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి బాలల సంరక్షణ కమిటీ, బలోపేతంపై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి చంద్రశేఖర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాన్‌గల్: బాల్యవివాహాల నిర్మూలనకు అందరూ భాగస్వాములు కావాలని డీఆర్‌డీవో పీడీ ఉమాదేవి పిలుపు నిచ్చారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అమరచింత : ప్రతిజ్ఞ చేయిస్తున్న డీపీవో సురేశ్‌కుమార్



శ్రీరంగాపురం: గోడపత్రిక ఆవిష్కరిస్తున్న అధికారులు



కొత్తకోట: గోడపత్రికను ఆవిష్కరిస్తున్న అధికారులు



మాట్లాడుతున్న గట్టుయాదవ్

సదస్సు విజయవంతం చేయండి

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే : ఈనెల 29 వనపర్తిలో నిర్వహించే రైతు నిరసన సదస్సును విజయవంతం చేయాలని భారాస జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్ కోరారు. శుక్రవారం పట్టణంలోని 3, 4, 5 వార్డుల్లో ఆయన పార్టీ నాయకులతో పర్యటించి రైతులకు ప్రభుత్వం చేస్తున్న మోసాలను వివరించారు. కార్యక్రమంలో భారాస పట్టణ అధ్యక్షుడు రమేశ్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే : రైతు భరోసా ఇవ్వకుండా రైతన్నలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి పుట్టగతులు ఉండవని భారాస జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, జిల్లా మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం ఖిల్లాగణపురంలో మండల పార్టీ అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ విజయ్‌కుమార్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు సామ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరంగాపురం: అన్నదాతలకు రైతుభరోసా ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం మోసగించిందని భారాస జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ పేర్కొన్నారు. ఈనెల 29న జరిగే రైతు నిరసన సభకు మండల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరుతూ.. కంబాళాపురంలో భారాస నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో భారాస నాయకులు పాల్గొన్నారు.

తెరపై ఈనాడు

శ్రీనివాస: **దేవర**, వెంకటేశ్వర: **పొట్టేలు**, శ్రీరామ: **వెనమ్**

–న్యూస్‌టుడే, వనపర్తి న్యూటౌన్

పర్యాటక ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం : మంత్రి



సోమశిలలో పర్యాటక బోటును ప్రారంభించిన మంత్రి జూపల్లి కృష్ణారావు, పుర ఛైర్‌పర్సన్ మేకల రమ్యకుమారి

కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధే లక్ష్యమని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం మండలంలోని సోమశిల గ్రామంలో పర్యాటక ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం కాటేజీలు, హోటళ్లను పరిశీలించి పర్యాటకులతో మాట్లాడారు. టూరిజం శాఖ బోటును ప్రారంభించి కృష్ణానదిలో విహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నది పరివాహక ప్రాంతాలను మల్లేశ్వరం వద్ద ఉన్న ఐ ల్యాండ్ ప్రాంతాన్ని, సింగోటం, జటప్రోలు, అమరగిరి ప్రాంతాల్లో పర్యాటకాభివృద్ధి చేస్తామన్నారు. ఆర్కిటెక్చర్ రాందేవ్‌రావుతో సోమశిల, కొల్లాపూర్ పట్టణంలోని రోడ్డు మధ్యలో ఉన్న విభాగినిని తీర్చిదిద్దుతామన్నారు. సోమశిలలోని వీవీఐ హోటల్ సమీపంలో స్నానఘట్టాలు నీటి సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో పురపాలిక అధ్యక్షురాలు మేకల రమ్యకుమారి, కౌన్సిలర్ నయీం, మాజీ జడ్పీటీసీ హనుమంత్‌నాయక్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అత్యాధునిక కోర్సులు సద్వినియోగం చేసుకోవాలి

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: జిల్లాలోని ముందస్తు సాంకేతిక కేంద్రం (ఐటీఐ)లో అందుబాటులో ఉన్న అత్యాధునిక కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఐటీఐ ప్రవేశాలపై సంబంధితాధికారులతో పాటు అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్‌లో ఉపాధి పరంగా డిమాండ్ ఉన్న కోర్సులను టాటా కన్సల్టెన్సీ సహకారంతో ప్రభుత్వం నూతనంగా కోర్సులను ప్రవేశపెట్టిందన్నారు. కోర్సు పూర్తికాగానే కంపెనీ ద్వారా మంచి ఉద్యోగం లభిస్తుందన్నారు. 62 సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తిగల వారు ఈ నెల 30వ తేదీ వరకు కళాశాలకు వెళ్లి ప్రవేశం తీసుకోవచ్చన్నారు. సమావేశంలో డీఆర్డీవో పీడీ ఉమాదేవి, విద్యాశాఖ అధికారులు, ఐటీఐ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి విరాళం

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని కానాయపల్లి స్టేజీ వద్ద వెలసిన శ్రీకోటిలింగేశ్వరాలయంలో నూతనంగా చేపట్టిన ధ్యాన మందిరం నిర్మాణానికి హైదరాబాద్‌కు చెందిన భీమా శ్రీనువాసులు శుక్రవారం రూ.80 వేలు విరాళం అందజేశారు. భార్య ఆండాళమ్మ జ్ఞాపకార్థం ఇచ్చారని ఆలయ నిర్వాహకులు శేఖరయ్య, అర్చకులు జగదీశ్ తెలిపారు.

బాధితుడికి ఆర్థిక సాయం

పెబ్బేరు పట్టణం: మండలంలోని తోమాలపల్లి గ్రామానికి చెందిన విష్ణు యాదవ్ అనారోగ్యానికి గురై హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. గ్రామానికి వచ్చిన అతనికి శుక్రవారం గ్రామస్థులు పరామర్శించి, రూ.25 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి సురేందర్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామన్‌గౌడ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

సంత స్థలానికి శాశ్వత పరిష్కారం చూపండి



రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న పట్టణ ప్రజలు

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని సంత స్థలాన్ని పూజారులు అగ్రిమెంట్ చేశారని ఓ స్థిరాస్తి వ్యాపారి శుక్రవారం కూలీలు, పొక్లెయిన్‌తో చదును చేయిస్తుండగా పట్టణ ప్రజలు అడ్డుకున్నారు. అతనికి వ్యతిరేకంగా సుభాష్ చౌరస్తాలో రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అతనిపై పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై పుర కార్యాలయంలో అధ్యక్షురాలు కరుణశ్రీ విలేకరులతో మాట్లాడుతూ.. సంత స్థలం విషయంలో ప్రజలకు పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. బయటి వ్యక్తులు వచ్చి సదరు స్థలం తమదని పట్టణంలో భయాందోళనలు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి చొరవ తీసుకుని పూజారులతో మాట్లాడి భూసేకరణ చట్టం ద్వారా వారికి మరోచోట స్థలం కేటాయించి సంత స్థలానికి శాశ్వత పరిష్కారం చూపాలని ఆమె కోరారు. కార్యక్రమంలో పుర ఉపాధ్యక్షుడు కర్రెస్వామి, కౌన్సిలర్లు పార్వతి. సుమతి, చిన్నఎల్లారెడ్డి, ఎల్లస్వామి, రామకృష్ణ, గోపిబాబు పాల్గొన్నారు.

నకిలీ ధ్రువపత్రం ఇచ్చారని.. కళాశాల నిర్వాహకులపై ఫిర్యాదు

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : పట్టణ శివారులోని ఉషోదయ బీఈడీ కళాశాల నిర్వాహకులు నకిలీ ధ్రువపత్రం ఇచ్చారని బాధితుడు హైదరాబాద్ బోడుప్పల్‌కు చెందిన మురారీ దామన్ వనపర్తి గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మురారీదామన్ 2014లో ఉషోదయ బీఈడీ కళాశాలలో బీఈడీ చదివారు. అప్పట్లో కళాశాల నిర్వాహకులు బీఈడీ ఉత్తీర్ణుడైనట్లు సమాచారమిచ్చారు. ధ్రువపత్రం ఇవ్వమని కోరగా వారు ఇవ్వలేదు. డీఎస్సీ ప్రకటన రావడంతో కళాశాల నిర్వాహకులు ఆయనకు వాట్సాప్ ద్వారా వాటిని పంపారు. మురారీ దామన్ డీఎస్సీలో ఉద్యోగం సాధించారు. ఒరిజినల్ ధ్రువపత్రాల కోసం ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్లి కళాశాల నిర్వాహకులు పంపిన పత్రాలు చూయించగా వారు వాటిని నకిలీ అని గుర్తించారు. బాధితుడు హైదరాబాద్‌లోని మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారు వనపర్తికి వెళ్లాలని సూచించారు. శుక్రవారం రాత్రి బాధితుడు వనపర్తి గ్రామీణ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి నకిలీ సర్టిఫికెట్ ఇచ్చిన కళాశాల నిర్వాహకులపై ఫిర్యాదు చేశారు.

పొంచి ఉన్న ప్రమాదం..



గోపాల్‌పేట నుంచి చెన్నూరుకు వెళ్లే దారిలో పెద్దవాగుపై నిర్మించిన వంతెనకు రక్షణగోడ లేనందున ప్రమాదం పొంచి ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు వంతెన పై నుంచి నీరు పారింది. ప్రమాదాలు జరగకముందే రక్షణగోడ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. సమస్యను పంచాయతీరాజ్ ఏఈ భాస్కర్ దృష్టికి తీసుకెళ్లగా రక్షణగోడ నిర్మాణానికి అంచనాలు తయారుచేసి ప్రతిపాదనలు పంపిస్తామని చెప్పారు.

- న్యూస్‌టుడే, వనపర్తి వ్యవసాయం

వాహనం దగ్ధం

ఆత్మకూరు, న్యూస్‌టుడే : ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ యార్డులోని పౌరసరఫరాల గోదాం వద్ద నిలిపి ఉంచిన వాహనం (బొలెరో) వాహనం దగ్ధమైంది. ప్రమాదవశాత్తు వాహనానికి నిప్పంటుకుని ఉంటుందని, ఈ ఘటనలో వాహనం క్యాబిన్ పూర్తిగా కాలిపోయిందని యజమాని చాకలి సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నరేందర్ పేర్కొన్నారు.

ఎత్తిపోతల పంప్‌హౌస్ వద్ద చోరీ

ఆత్మకూరు, న్యూస్‌టుడే : మండలంలోని గుంటిపల్లి ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. కొంతకాలం నిరుపయోగంగా ఉన్న ఎత్తిపోతల పథకం పంప్ హౌస్‌లోని విద్యుత్తు నియంత్రికను ధ్వంసం చేసి రాగి పలకాలను ఎత్తుకెళ్లారు. ఎత్తిపోతల పథకం ఆయకట్టుదారుల సంఘం నాయకులు గుర్తించి నీటిపారుదలశాఖ ఏఈ వంశీకృష్ణకు సమాచారం ఇవ్వడంతో ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నరేందర్ తెలిపారు.

దౌర్జన్యం చేశారని.. కేసు నమోదు

కొత్తకోట, న్యూస్‌టుడే : కొత్తకోట పురపాలక అధ్యక్షురాలు భర్త విశ్వేశ్వర్ తనపై దౌర్జన్యం చేశారంటూ వార్డు ఆఫీసర్ (జూనియర్ అసిస్టెంట్) జయరాములు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామని ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపారు. పట్టణానికి చెందిన పెచ్చన్నగారి భాస్కర్‌రెడ్డి భార్య పేరున ఇంటిని మార్చాలంటూ తనపై ఒత్తిడి తెచ్చారని నిబంధనలకు విరుద్ధంగా చేయలేనని చెప్పడంతో దాడి చేశారని ఇదే సమయంలో భాస్కర్‌రెడ్డి సైతం తన చేతిలో ఉన్న డైరీని లాక్కొన్ని తనపై విసిరారని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

పొలం హద్దు ధ్వంసం..

అమరచింత: నందిమల్ల గ్రామానికి చెందిన కుర్వ రంగన్న పొలం హద్దు గట్టును ధ్వంసం చేయడంతో ఆరుగురిపై కేసు నమోదు చేశామని ఏఎస్సై జమీరుద్దీన్ తెలిపారు. శుక్రవారం కుమ్మరి గోవింద్, వెంకటేశ్, గోవింద్, ములింద, శాంతమ్మ, సాంబశివుడు హద్దులు తొలగించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వీపనగండ్ల(చిన్నంబావి), న్యూస్‌టుడే : మండలంలోని తూంకుంట వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేశామని ఎస్సై కె.రాణి తెలిపారు. తూంకుంట గ్రామానికి చెందిన కోటేశ్వర్, పరశురాముడు ట్రాక్టర్ల ద్వారా వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా సమాచారంతో వెళ్లి ట్రాక్టర్లను పట్టుకొని స్టేషన్‌కు తరలించామన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేశామని తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని ఎస్సై హెచ్చరించారు.

గోపాల్‌పేట, న్యూస్‌టుడే : అనుమతి లేకుండా కోడేరు మండలం నాగులపల్లి గ్రామానికి చెందిన మాందాపురం మనోజ్ ఏదుల వాగు నుంచి ట్రాక్టరుతో ఇసుక తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేశామని ఎస్సై నరేశ్ కుమార్ తెలిపారు. ప్రభుత్వం అనుమతులు ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మాదిగ ధర్మయుద్ధ సన్నాహక సమావేశం

ఆత్మకూరు, న్యూస్‌టుడే : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలులో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ జడ్చర్లలో ఈనెల 30న ధర్మయుద్ధ మహాసభ నిర్వహిస్తున్నక్రమంలో ఆత్మకూరు ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద శుక్రవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశాన్ని ఉద్దేశించి రాష్ట్ర నాయకులు అజ్జపాగ లక్ష్మణ్ మాట్లాడారు. ఎలాంటి కాలయాపన లేకుండా రిజర్వేషన్ వర్గీకరణ అమలుచేస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రివర్గ ఉపసంఘాల ఏర్పాటు పేరిట కాలయాపన చేస్తున్నారని ధ్వజమెత్తారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మాసన్న, దండు శ్రీను, జానకిరాములు, కట్టెమండి రాజు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతపై నిర్లక్ష్యం వద్దు



అమరచింతలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న జిల్లా మత్స్యశాఖాధికారి లక్ష్మప్ప

అమరచింత, న్యూస్‌టుడే : పరిసరాల శుభ్రతపై నిర్లక్ష్యం వద్దని జిల్లా మత్స్యశాఖాధికారి లక్ష్మప్ప అన్నారు. శుక్రవారం పట్టణంలోని పదో వార్డులో 'డ్రైడే' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పిచ్చి మొక్కలు తొలగింపజేసి, దోమల నివారణకు ద్రావణం పిచికారీ చేయించారు. కార్యక్రమంలో పుర ఛైర్‌పర్సన్ వి.మంగమ్మ, కమిషనర్ నూరుల్ నజీబ్ పాల్గొన్నారు.

శ్రీరంగాపురం, న్యూస్‌టుడే : వంటగదిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని మండల ప్రత్యేక అధికారిణి నుశిత అన్నారు. డ్రైడే- ఫ్రైడే సందర్భంగా మండలంలోని కంబాళాపురంలో పరిసరాలను, పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె శుక్రవారం పరిశీలించారు. ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆత్మకూరు, న్యూస్‌టుడే : పారిశుద్ధ్య పరిరక్షణలో ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆత్మకూరు పుర ఛైర్‌పర్సన్ గాయత్రి పేర్కొన్నారు. శుక్రవారం ఆత్మకూరు పురపాలికలోని నాలుగో వార్డులో నిర్వహించిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో కమిషనర్ శశిధర్, కౌన్సిలర్ మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్, న్యూస్‌టుడే : పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని డీఆర్‌డీవో పీడీ ఉమాదేవి అన్నారు. డ్రైడేలో భాగంగా శుక్రవారం మండలంలోని దావూత్‌ఖాన్‌పల్లి గ్రామంలో ఆమె పర్యటించారు. గ్రామంలో తిరిగి ప్రజలకు అవగాహన కల్పించారు. ఆమెతో పాటు ఎంపీడీవో గోవిందరావు, ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ధర్నా



తహసీల్దార్ చాంద్‌పాషకు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థులు

ఆత్మకూరు, న్యూస్‌టుడే : విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ శుక్రవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అంతకు ముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ధర్నానుద్దేశించి ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు కె.రాఘవ, ఉపాధ్యక్షుడు మహేందర్, సహాయ కార్యదర్శి వినయ్ మాట్లాడారు. ప్రభుత్వం బకాయి ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని, ఉపకార వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ చాంద్‌పాషకు వినతిపత్రం సమర్పించారు. ధర్నాలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు రాఘవేంద్ర, అశోక్, జ్యోతి, నందిని తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు పట్టణం: రాష్ట్రంలో ఆరేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, ఉపకార వేతనాల బకాయిలు విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్షులు లక్ష్మణ్ శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో నాయబ్ తహసీల్దార్ లక్ష్మీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం బకాయిలు విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థుల నుంచి ధ్రువపత్రాల కోసం ప్రైవేట్ యాజమాన్యాలు డబ్బు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. వెంటనే బకాయిలు, విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అనుమతి ఉందిగా.. అడిగేదెవరు?

ఇష్టానుసారంగా రెట్టింపు మట్టి తరలింపు

టాస్క్‌ఫోర్స్

కల్వకుర్తి, న్యూస్‌టుడే : జాతీయ రహదారుల నిర్మాణం పేరిట అనుమతుల మాటున మట్టి దందా జోరుగా సాగుతోంది. గడువు దాటినా యథేచ్ఛగా మట్టిని తరలిస్తుండటంతో ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడుతోంది. జాతీయ రహదారి నిర్మాణం పేరిట అనుమతి తీసుకొని గడువు దాటినా.. నిర్విరామంగా మట్టి తరలిస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో అచ్చంపేట, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్ ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలను ఎంపిక చేసుకొని అక్రమంగా మట్టిని తరలించి దళారులు రూ. కోట్లు దండుకొంటున్నారు.

గడువు 60 రోజులే.. : ఊర్కొండ మండల కేంద్రం వత్తడిగుట్ట సర్వే నంబరు 244 దాదాపు వందల ఎకరాల విస్తీర్ణంలో ఉంది. రూ.886.69 కోట్లతో చేపట్టిన 167కె కల్వకుర్తి-కరివెన జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమయ్యే మట్టిని తరలించటానికి, జిల్లా మైనింగ్ శాఖ నుంచి 13 జూన్ 2024 నుంచి 60 రోజుల గడువు లోపు 10వేల మెట్రిక్ టన్నుల మట్టి లేదా కంకరను తరలించుకునేలా అనుమతి తీసుకున్నారు. ప్రభుత్వానికి రూ.2 లక్షల రాయల్టీ, రోడ్డు పర్మిట్ కోసం రూ.4 వేలు చెల్లించారు. అనుమతి గడువు దాటి నెల రోజులైనా ఇప్పటికీ గుట్ట నుంచి రోజు తప్పి రోజు మట్టిని తరలిస్తూనే ఉన్నారు. వందలాది వాహనాల్లో తరలిస్తుండటంతో చెల్లించిన రూ.2 లక్షల రాయల్టీకి వంద రెట్లు మట్టి తరలించుకొని రూ. కోట్లు సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులకు తెలిసినా చర్యలు చేపట్టడం లేదనే విమర్శలున్నాయి.

ఆరు నెలల నుంచి తరలింపు.. : కల్వకుర్తి మండలం తుర్కలపల్లి గ్రామం 167 కె జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న రాళ్ల గుట్ట సర్వే నంబరు 522లో దాదాపు 58 ఎకరాల్లో విస్తరించి ఉంది. 8 ఎకరాల వరకు ఇప్పటికే పలువురు ఆక్రమించినట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. రాళ్ల గుట్ట నుంచి జాతీయ రహదారి నిర్మాణానికి మట్టి తరలింపునకు అనుమతి తీసుకున్నారు. ఆరు నెలల నుంచి లక్షల మెట్రిక్ టన్నుల మట్టి తరలించారు. తరలించిన ప్రాంతంలో సుమారు 100 మీటర్ల పొడవు, 50 మీటర్ల వెడల్పు గల పెద్ద గుంత ఏర్పడింది. నిత్యం ఇక్కడి నుంచే మట్టిని తరలిస్తూనే ఉన్నారు. ఇక్కడి నుంచి రాత్రి సమయంలో కొందరు అక్రమార్కులు మట్టిని ఇష్టానుసారంగా తరలిస్తున్నారని సమీప గ్రామాల ప్రజలు తెలిపారు. లక్షల మెట్రిక్ టన్నుల మట్టి మాయమైంది.

అధికారులేమంటున్నారంటే.. : తుర్కలపల్లి సమీపంలోని గుట్ట నుంచి మట్టి తరలింపు అనుమతులు పరిశీలించి ఉన్నతాధికారులకు సమాచారమిస్తామని కల్వకుర్తి తహసీల్దారు ఇబ్రహీం తెలిపారు. ఒకవేళ అనుమతులు లేకుంటే మట్టిని తరలించకుండ నిలుపుదల చేస్తామన్నారు.



ఊర్కొండ సమీపంలోని వత్తడిగుట్టల నుంచి మట్టి తరలిస్తున్న వాహనాలు

● ఊర్కొండ వత్తడిగుట్టల నుంచి మట్టిని తరలించటానికి జాతీయ రహదారుల పనులు చేపట్టిన గుత్తేదారు తీసుకొన్న అనుమతి గడువు దాటింది. ఈ విషయాన్ని జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకెళ్లి తీసుకుంటామని తహసీల్దారు రాంకోటి పేర్కొన్నారు. జిల్లా మైనింగ్ అధికారి రవీందర్‌ను చరవాణి ద్వారా సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించండి

గోపాల్‌పేట, న్యూస్‌టుడే : మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు నాయకులు, ప్రజలు సహకరించాలని నూతన ఎస్సై నరేశ్‌కుమార్ పేర్కొన్నారు. బాధ్యతలు స్వీకరించిన ఎస్సైని పలువురు నాయకులు కలిసి శాలువాలు, పూలమాలలు సత్కరించారు. ఎస్సైని కలిసిన వారిలో కాంగ్రెస్ నాయకులు సుధాకర్‌రావు, ప్రవణ్‌కుమార్, శివన్న, వెంకటయ్య, బాలపీరు, శేఖర్, గోవర్ధన్‌రెడ్డి, బాలయ్య తదితరులు ఉన్నారు.

సీడీఎంఏ కార్యాలయం ముట్టడికి కార్మికులు

అమరచింత, న్యూస్‌టుడే : పురపాలక సంఘంలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న పుర కార్మికులు శుక్రవారం సీడీఎంఏ కార్యాలయం ముట్టడికి శుక్రవారం వాహనంలో తరలివెళ్లారు. సంఘం వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ప్రభాకర్, నాయకులు ప్రేమ్, తిప్పన్న, గౌస్, హరికృష్ణ, చిన్న పాల్గొన్నారు.

హక్కుల సాధనకు సంఘటితం కావాలి

పాన్‌గల్, న్యూస్‌టుడే : హక్కుల సాధన కోసం ప్రతి మహిళా సంఘటితం కావాలని భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి, మాజీ అధ్యక్షురాలు కళావతమ్మ పిలుపు నిచ్చారు. శుక్రవారం మండలంలోని కేతేపల్లి గ్రామంలో మహిళా సమాఖ్య సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేశం,రాష్ట్రంలో మహిళల, బాలికలపై దాడులు అత్యాచారాలు, హత్యలు జరిగిన నిందితులకు శిక్షలు పడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంజనమ్మ, లక్ష్మి, శంకరమ్మ, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

IN THE HIGH COURT FOR THE STATE OF TELANGANA AT HYDERABAD

I.A.No. 1 of 2023
And
I.A.No.2 of 2023
And
I.A.No.2 of 2024
in
C.R.P.No. 683 of 2014

Between:
Venkateswarlu, S/o Rama Kistaiah (Died) per LR's. ... **Petitioners**

AND

Gandla Veeranna, S/o Thirupathaiah (Died) per LR's. ...**Respondents**

To
1) **Smt. G.Srilatha,** W/o.late Sri G.Ramulu, R/o.Srirangapur Village, Pebbair Mandal, Wanaparthy District.
2) **Smt. Geetha,** W/o.Mahesh, R/o. Srirangapur Village, Pebbair Mandal, Wanaparthy District.
3) **Smt. Swapna,** W/o.Viswanath, R/o. Srirangapur Village, Pebbair Mandal, Wanaparthy District.
4) **Smt. Shyama,** W/o.Murali, R/o. Srirangapur Village, Pebbair Mandal, Wanaparthy District.
5) **Smt. Bhavani,** W/o.not known, R/o. Srirangapur Village, Pebbair Mandal, Wanaparthy District.
... **Proposed Respondent 9 to 13**

It is informed to you that the above I.A.No.1 and 2 of 2023 are filed for setting aside of order of dismissal dated 08-06-2022 and also to condone delay in filing petition to set aside the order of dismissal. When notice was ordered by the Hon'ble High Court, it has come to light that Respondents 2 and 5 died and accordingly an application to bring you as Legal Representatives of Respondents 2 and 5 was filed in I.A.No.2 of 2024 and notice sent to you was returned with an endorsement that "insufficient address" and therefore the Hon'ble High Court permitted the counsel for petitioner to publish the notice in the News Paper and posted the matter for your appearance on 04-11-2024.

Hence please take notice that the above Civil Revision Petition along with I.As. would be listed on 04-11-2024 before the Hon'ble High Court for your appearance and you make arrangements either to appear in person or through counsel on the day when the matter is listed, otherwise the matter would be decided on the basis of material available on record.

This is for your information.

K RAMA SUBBA RAO, Advocate
G-5, LAKSHMI APARTMENTS
NALGONDA CROSS ROADS
HYDERABAD-500 036, Mobile : 9885112605